క్లుప్తంగా

సర్పంచ్ మసేనుకు ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ మసేనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అనారోగ్యంతో బాధ పడుతున్న తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేనును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం పరామర్శించారు. మసేను కాలి వేలికి గాయం కావడంతో కొద్దికాలంగా బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఎన్‌టీపీసీ దీపాంజలి నగర్‌లో ఉంటూ, స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మసేనును పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: తానాం గ్రామంలోని ఓ బెల్టుషాపుపై దాడి చేసిన పరవాడ పోలీసులు 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు తన సిబ్బందితో బుధవారం సదరు పాన్ షాపుపై దాడి చేసి, అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ షాపు యజమానిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

అగనంపూడి: తెలుగు జాతికి, భాషా ఔన్నత్యానికి గుర్తింపు తీసుకువచ్చిన శ్రీకృష్ణదేవరాయల కీర్తిని నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని రాష్ట్ర కేటీబీ జేఏసీ ప్రతినిధి దాసరి రాము, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నువానిపాలెంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన మహోన్నత వ్యక్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ముందు వరుసలో ఉంటారన్నారు. స్థానికంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామాభివృద్ధి కమిటీని వారు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా నాయకురాలు గొన్నా రమాదేవి, అఖిలపక్షాల నాయకులు గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, పాముల వసంతరావు, కరణం కళావతి, దాసరి వెంకట జయలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుమ్మల శ్రీను, ఇల్లపు శ్రీను, నరేంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'భవదీయం' ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సంస్థను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: భవదీయం సేవా సంస్థ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు కట్టమూరి శ్రీనివాసరావు తెలిపారు. మురళీనగర్‌లో భవదీయం స్వచ్ఛంద సేవా సంస్థను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ దేవాలయాలకు స్వచ్ఛంద సేవకులను పంపిస్తామన్నారు. ఆయా దేవాలయాల ఉత్సవాలు, దేవతా పారాయణం, ఇతర ఆధ్యాత్మిక ఉత్సవాలకు తమ సంస్థ ద్వారా కోలాటం, సాంస్కృతిక కళాకారుల బృందాలు పంపిస్తామని చెప్పారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడం కోసమే సంస్థను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సుగుణకుమారి పాల్గొన్నారు.

ఆటాడితే..వేటే..

- పందెం రాయుళ్లకు పోలీసుల హెచ్చరిక
- పరసల వేళ యంత్రాంగం అప్రమత్తం
- చోరీలు, ఇతర నేరాలపై నిఘా నేత్రం



పెందుర్తి పోలీసులు పందాల్లో స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు (ఫైల్)

పెందుర్తి: సంక్రాంతి తరువాత పరసల సందడి మొదలైందంటే పందెం రాయుళ్లకు 'పండగే'. మహాశివరాత్రి వరకు సుమారు రెండు నెలల పాటు ఇదే జోరు కొనసాగుతుంది. తోటలు.. చెరువు గట్లు ..గుట్టు చప్పుడు కాని ప్రతీచోట అనేక రకాల పందేలతో పండగను రక్తి కట్టిస్తుంటారు. ఓ వైపు కోడి పందాలు.. మరోవైపు పేకాట.. ఇంకో వైపు లాటరీ బల్లలు.. కాయ్‌రాజా కాయ్ అంటూ తమదైన శైలిలో ఆహ్వానం పలుకుతుంటారు. కానీ ఈ ఏడాది వీరి ×ఆటల×కు అడ్డుకట్ట వేస్తామంటూ పోలీసులు కూడా సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల పందెంరాయుళ్ల ఆట కట్టిస్తున్నారు. ముందస్తుగానే వారికి హెచ్చరికలు జారీ చేసి, నిలువరిస్తున్నారు. ప్రశాంతంగా పండగ చేసుకోవాలి తప్ప పందేలు కుదరవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కాదుకూడదని ఆటాడితే.. వేటాడేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే పందాలతో పాటు నేరాల నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేశామని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

జూదానికి అనుకూలం

పెందుర్తి నియోజకవర్గంలో తోటలు అధికంగా ఉంటాయి. పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, నరవ, జెర్రిపోతులపాలెం, సతివానిపాలెం, చినముషిడివాడ వుడాకాలనీ, సబ్బవరం, పరవాడ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జీడిమామిడి, మామిడి, సరుగుడు తోటలు విస్తారంగా ఉన్నాయి. ఇవి చాలావరకు పేకాట, కోడిపందేలకు అనుకూలంగా ఉన్నాయి. వీటితో పాటు అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా పందెంరాయుళ్లు స్థావరాలుగా వినియోగించుకుంటున్నారు. వీటిని ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు ఈ డెన్‌లను నడిపిస్తున్నారు. ఆటకు ఇంత అని వారు నిర్ధారించి ఆటగాళ్ల దగ్గర వసూలు చేస్తుంటారు. వీరు ఆటగాళ్లకు మద్యం, ఇతర సౌకర్యాలు కల్పిస్తుంటారు.

లక్షల్లోనే పందేలు..

ఆటల్లో పందేలు రూ.లక్షల్లోనే ఉంటాయి. ఆటగాళ్లు చాలావరకు నేరుగా డబ్బుతోనే ఆటకు దిగుతారు. ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని స్మార్ట్ ఫోన్ల ద్వారా అక్కడిక్కడే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌లు కూడా జరుగుతుండడం విశేషం. మరికొంత మంది భూములు, వాహనాల పత్రాలు పెట్టి పందాలు కాస్తుంటారు.

అతిక్రమిస్తే కఠిన చర్యలు



పరసల్లో జూదాలు, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధం. ఎవరైనా అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే పెందుర్తి ప్రాంతంలో పందేలు ఆడే, కోళ్లకు కత్తులు కట్టేవారిని పిలిపించి బైండోవర్ చేశాం. మరికొంత మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. పందేలు నిర్వహించే వారు ఎంతటివారైనా వదిలిపెట్టం. ఇతర నేరాలపై కూడా మా సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు కూడా ఇటువంటి వాటిపై మాకు సమాచారం ఇచ్చి సహకరించాలి. ఫోన్:94407 96039, 0891–2764233 నంబర్లకు సంప్రదించాలి.

– ఎం.శ్రీనివాసరావు, పెందుర్తి సీఐ

వైభవంగా ముత్యాలమ్మ తల్లి పరస



పూజలందుకున్న ముత్యాలమ్మతల్లి



రామాలయం వద్ద భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వేపగుంటవాసుల ఇలవేల్పు ముత్యాలమ్మతల్లి పరస మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. తప్పెటగుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. వేపగుంట, పురుషోత్తపురం, నాయుడుతోట, అప్పన్నపాలెం, చీమలాపల్లి, లక్ష్మీపురం ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

ఘనంగా రాములోరి తీర్థం

పరవాడ: పరవాడ గ్రామంలోని శ్రీ రాముల వారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా జరిపించారు. ఆలయం వద్ద నిర్వహించిన భజనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ మహోత్సవంలో భజనలతో పాటు చిడతలు, సాముగరిడీలు, నేల డ్యాన్సులు, చిటికల భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, పరవాడ సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి, స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

కనులపండువగా సీతారాముల తీర్థం

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లో సీతారాముల వారి తీర్థ మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాము గరిడీలు, చిడతల భజనలు, కోలాటాలు, చిటికెల భజనలు ఆకట్టుకున్నాయి. బంగారమ్మపాలెంలో పరసలో సర్పంచ్ దాడి లావణ్య, మాజీ సర్పంచ్ దొడ్డి అప్పారావు, పెదనాయుడుపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బవరపు బుజ్జి, నాగభూషణం, గొర్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'



ఆస్థాన మండపాన్ని శుభ్రం చేయిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు



చీమలాపల్లిలోని శిబిరంలో రోగికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



శిబిరంలో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

- చీమలాపల్లిలో జగనన్న సురక్ష శిబిరానికి విశేష స్పందన

పెందుర్తి: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. అందులో భాగంగా 95వ వార్డు చీమలాపల్లిలో బుధవారం నిర్వహించిన శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్న సత్సంకల్పంతో ఈ బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. నిరుపేదలు వైద్యానికి, విద్యకు ఇబ్బందులు పడకూడదన్న ఆలోచనతో ఆయా రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. సీఎంగా వైఎస్ జగన్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

400 మందికి వైద్య సేవలు

శిబిరంలో మొత్తం 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. కంటి పరీక్షలు చేసిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం మరికొందరిని ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, నాయకులు అయిత ఎర్రయ్య, రాపర్తి మాధవరావు, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బి.రాము, యిల్లపు పరదేశినాయుడు, పెదగాడి చిన్నారావు, బొడ్డు దేముడుబాబు, విరోతు విశ్వనాథం, మింది రామునాయుడు, టైల్స్ రాజు, స్పెషలిస్ట్ వైద్యులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, వైద్యారోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

22న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రామునాయుడు

సబ్బవరం: అయోధ్యలో ఈ నెల 22న శ్రీ రామచంద్రుడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ ఇంటా రాత్రి 7 గంటలకు దీపాలు వెలిగించాలని బీజేపీ నాయకుడు గొర్లి రామునాయుడు తెలిపారు. స్థానిక దుర్గమాంబ ఆలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీతోనే రామరాజ్యం సాధ్యం అవుతుందన్నారు. అంతకుముందు గొటివాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మా పాఠశాల అద్భుతం

తాము చదివిన పాఠశాల రూపురేఖలు మారి, కార్పొరేట్ లుక్ సంతరించుకోవడంతో లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి అద్భుతమని కొనియాడారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ.. సొంతూరు పండగకు వచ్చిన వారంతా పాఠశాలను చూసి ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో వారు పాఠశాల ప్రగతిపై ప్రశంసల జల్లు కురిపించారు.

- లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థుల హర్షం
- నాడు –నేడులో రూ.65 లక్షలతో పాఠశాల అభివృద్ధి
- దాతల సహకారంతో మరికొన్ని వసతులు



సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్వ విద్యార్థులు



తాము చదువుకున్న పాఠశాల వద్ద లంకెలపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అగనంపూడి: లంకెలపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు గుర్రం శంకరరావు, సతీష్‌కుమార్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా పాఠశాలు రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు చదువుకోడానికి అనువైన వాతావరణం కల్పించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు వసతులను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ కృషి.. దాతల సహకారం

ప్రభుత్వ కృషి, చొరవ వల్లనే పాఠశాలకు అధునాతన వసతులు సమకూరాయని లంకెలపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.65 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అలాగే.. లారస్ ల్యాబ్స్ రూ.28 లక్షలతో క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దిందన్నారు. వసుధా ఫార్మా కంపెనీ మరో రూ.20లక్షలతో విద్యుత్ సౌకర్యం, ఆర్‌వో ప్లాంట్ చేయగా, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు సహకారంతో రూ.5లక్షలతో పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులు గదులకు సేఫ్టీ గ్రిల్స్, ఫర్నిచర్, సరస్వతీ దేవి విగ్రహం, మైక్‌సెట్ వంటి సౌకర్యాలు కల్పించారన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు మరిన్ని వసతులు కల్పించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రౌతు అప్పాజీ, గాంధీ తదితరులు మాట్లాడారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా జగనన్న పాలన



మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె నివాసంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్య ఫలాలు బడుగు బలహీన వర్గాలకు అందాలన్నదే జగనన్న ఆశయమన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వమూ పాటించని సామాజిక న్యాయాన్ని వైఎస్సార్‌సీపీ సర్కారు చేతల్లో చూపిస్తోందని పేర్కొన్నారు. సీఎం జగన్ ఆలోచనా విధానం, విజన్ వల్ల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత దిశగా పేద వర్గాల వారు నేడు తృప్తి పొందుతున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గౌరవార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం, ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించడం గొప్ప విషయంగా అభివర్ణించారు. రాబోయే తరాలు సైతం గుర్తుచేసుకునేలా స్మృతివనాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

సామాజిక సాధికారతకు కృషి

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆయా కులస్తుల సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారని పిల్లి సుజాత అన్నారు. దేశంలోనే ఈ తరహా పాలన మరెక్కడా ఇంతవరకు తాను చూడలేదని ప్రశంసించారు. యాత కులస్తులంతా ముఖ్యమంత్రి వెంటే ఉంటారని ఆమె తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, ప్రధాన కార్యదర్శి బసరమాని లక్ష్మణరావు, ప్రతినిధులు బసరమాని ఈశ్వరరావు, నంపంగి మంగరాజు, సిమ్మా గోవింద్, సిమ్మా శ్రీనివాస్, పిల్లి సంతోష్, పిల్లి రాజరాఘవేంద్ర, ఎల్.తవిటయ్య, పిల్లి కన్నారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక గురువు భారత్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

అల్లిపురం : ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తుందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్థాపించిన బ్రహ్మ బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం సందర్భంగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మకుమారీ బోధనల ద్వారా విముక్తి కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశంలో యోగాకి విస్తృత ప్రాచుర్యం కల్పించారన్నారు. సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంకాలం బీచ్‌రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద అమరజ్యోతి బుర్ర కథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా అద్భుత పావన జీవిత చరిత్ర విని, చూసి తరించాలని కోరారు. బ్రహ్మ పోస్టర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్రరావు, సంస్థ ప్రతినిధులు రమా, బీకే శివలీల, శశికళ, సత్యవతి, బీకే వేణి తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర రహిత భారతం 'ఇట్లసుత' కావ్యం



ప్రసంగిస్తున్న రచయిత వరిగొండ కాంతారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహితీ సమావేశంలో రచయిత వరిగొండ కాంతారావు(వరంగల్) స్వీయ రచనా కావ్యం 'ఇట్లసుత'పై ప్రసంగించారు. భారతంలో యుద్ధం వల్ల కలిగే ప్రాణ నష్టం శ్రీకృష్ణుడికి ఇష్టం లేదని, అందువల్ల కర్ణుడు కౌరవ పక్షం నుంచి పాండవ పక్షంలోకి వస్తే యుద్ధాన్ని నివారించే వీలుంటుందన్న ఆలోచనతో ఇట్లసుత కావ్యాన్ని రచించినట్లు తెలిపారు. ఇట్లసుత తెలంగాణ మాండలికంలో వెలసిన సంపూర్ణ ఇతిహాసమని, భారతంలో ప్రతి పాత్ర అంతర్మథనాన్ని, ఆలోచనలను చక్కగా చిత్రించినట్లు చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఇట్లసుత కావ్యం కురుక్షేత్ర రహిత భారతం రచనని, జన నష్టం జరగకుండా రచయిత నైపుణ్యంతో వైవిధ్య రచన చేశారన్నారు. అనంతరం రచయిత కాంతారావును సత్కరించారు. రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులదే ఆ ఘనత



దీక్షలో పాల్గొన్న అగనంపూడి పోరాట కమిటీ మహిళలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ఘనత కార్మికులదేనని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. దేశంలోని ఏ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం చేసిన చరిత్ర లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1070వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులతో పాటు అగనంపూడి పోరాట కమిటీ మహిళలు పాల్గొని ఉక్కు దీక్షకు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అగనంపూడి పోరాట కమిటీ మహిళలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తగ్గిన కాలీఫ్లవర్ ధర



సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్ ధర తగ్గింది. కొద్ది రోజులుగా కిలో రూ.34కు విక్రయిస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా రూ.22కు ధర తగ్గడంతో వినియోగదారులు, హోటల్, తోపుడుబళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కాలీఫ్లవర్ రాజమహేంద్రవరం నుంచి వచ్చేది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలోని ఆర్లీ, సంతపాలెం రైతులు పండించి బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో కిలో ధర రూ.10కు దిగివచ్చే అవకాశం ఉంది.